క్లుప్తంగా

బాబా మందిరంలో మజ్జిగ పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బాబా మందిర సేవలను వినియోగించుకోవాలని ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు గౌతంరెడ్డి అన్నారు. ముత్యాలంపాడు సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా గౌతం రెడ్డి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం వేసవి ముగిసే వరకు ప్రతి గురువారం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మందిర కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాపురంలో..

డాక్టర్ బ్రహ్మ దేశం వాకర్స్ క్లబ్,ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన గురువారం దుర్గాపురానికి చెందిన గుర్రం లీలాకుమార్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యకరమంలో వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు, ఎక్స్‌రే వాకర్స్ క్లబ్ సభ్యులు కొల్లూరి, బి.ఆజనేయరాజు, వాకర్స్ అధ్యక్షుడు బ్రహ్మదేశం వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

21న యువకవి సమ్మేళనం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): సిద్ధార్థ అకాడమీ, కళాశాల స్వర్ణోత్సవాల సందర్భంగా ఈ నెల 21వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు సిద్ధార్థ ఆడిటోరియంలో యువకవి సమ్మేళనం నిర్వహిస్తున్నామని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కవి విమర్శకులు డాక్టర్ రావులపాటి సీతారాం, సిద్ధార్థ కాలేజీతో పాటుగా నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలి



పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా గురువారం ఎంజీ రోడ్డు, సుర్యారావుపేట, నక్కల రోడ్డు, ఫోర్చకల్ రోడ్డు, ఏలూరు రోడ్డు, రామవరప్పాడు రింగ్ జాతీయ రహదారి, కనకదుర్గ వారధి ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విజయవాడను వ్యర్థరహిత నగరంగా మార్చడానికి పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేయాలని, డివైడర్ల వద్ద ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అన్ని ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తుండాలని ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణను ఆదేశించారు. డివైడర్లలో హరితాన్ని మరింత పెంచాలని, నగరంలో కాలుష్యం తగ్గించడానికి మొక్కలను మరింత పెంచడానికి చర్యలు తీసుకోవాలని డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్‌ని ఆదేశించారు.

ఎన్ఐఎస్ పీజీ డిప్లమో కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

విజయవాడస్పోర్ట్స్: స్పోర్ట్స్ కోచింగ్ (2025–27) స్పెషలైజేషన్ 41వ బ్యాచ్‌లో ప్రవేశానికి పాటియలాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్(ఎన్ఎస్ఎన్ఐఎస్) నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డీఎస్‌డీవో ఎస్.ఎ.అజీజ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోచింగ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమో కోర్సు ప్రవేశానికి జిల్లాలోని అర్హులైన కోచ్‌లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను మే రెండో తేదీ లోపు htppr://www.rrc.nmir.in/ వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.

ఎస్ఆర్ఆర్‌లో ఉచిత వైద్య శిబిరం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన లివ్ హాస్పిటల్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం జరిగింది. శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, జనరల్ కార్డియాక్, పిజియోథెరపీ సేవలు అందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మంచి ఆరోగ్యం అందించాలనే మహోన్నత ఆశయంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ నరసింహారావు, డాక్టర్ హర్షిత తదితరులు మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్, అధ్యాపకులు బాలసుబ్రహ్మణ్యం, నాగేశ్వరరావు, వ్యాయామ విభాగాధిపతి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నా ఉపయోగం లేదు..

- మధురానగర్‌లో నిరుపయోగంగా కమ్యూనిటీ హాల్
- రోడ్లపైనే శుభకార్యాలు



మధురానగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్

మధురానగర్(విజయవాడసెంట్రల్): కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి రాకపోవడంతో మధురానగర్ పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో పేద, మధ్యతరగతి ప్రజలు సుమారు 50 వేల మంది పైగా నివసిస్తుంటారు. వీరికి కమ్యూనిటీ హాల్ కలగా మిగిలింది. ఇక్కడి హాల్ అందుబాటులోకి రాకపోవడంతో రోడ్లపైనే శుభకార్యాలు చేయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ప్రభుత్వం మారడంతో..

మధురానగర్, పసుపుతోట, విజయదుర్గానగర్, కేఎల్ రావు నగర్, వెంకటేశ్వరనగర్, హనుమాన్‌నగర్ తదితర ప్రాంత వాసుల సౌకర్యార్థం నాటి ఎమ్మెల్యే మల్లాది విష్ణు మధురానగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించారు. ఇంతలో ప్రభుత్వం మారడంతో పనుల్లో వేగం మందగించింది. దీనిపై స్థానికుల విజ్ఞప్తి మేరకు దశల వారీగా నిధులు విడుదల చేసి పనులు నిర్వహించారు.

కష్టాలు తీరతాయనుకుంటే

కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తవడంతో తమ కష్టాలు తీరాయని స్థానికులు ఆనందపడేలోపు.. ఇంతలో కరోనా రావడంతో కోవిడ్ స్టోరేజీ కేంద్రంగా కమూనిటీ హాలును వినియోగించారు. దీంతో ఇప్పటికీ ఈ ప్రాంత వాసులకు కమ్యూనిటీ హాలు అందుబాటులోకి రాలేదు. ఇప్పుడు దీన్ని కుట్టు శిక్షణకేంద్రంగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు.

రోడ్డుపైనే శుభకార్యాలు

ఇక్కడ కమ్యూనిటీ హాలు లేకపోవడంతో రోడ్లపైనే శుభకార్యాలు చేసుకుంటున్నారు. స్థోమత ఉన్నవారు దూర ప్రాంతాలకెళ్లి శుభకార్యాలు చేసుకుంటున్నారు. ఇక పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు మాత్రం ఇబ్బందులు పడుతూనే రోడ్డుపై షామియానాలు వేసి కార్యక్రమాలు పూర్తిచేసుకుంటున్నారు. తమకు ఈ కష్టాలు ఎప్పుడు తొలగుతాయో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్డును బ్లాక్ చేసి శుభకార్యాలు చేసుకోవడంతో వాహన చోదకులు తరచూ అవస్థ పడుతున్నారు. చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో విలువైన సమయంతో పాటు ఇంధనం వృథా అవుతోందంటున్నారు

మరో కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ఇప్పటికే నిర్మించిన కమ్యూనిటీ హాలు అందుబాటులోకి రాని దృష్ట్యా ఈ ప్రాంత ప్రజల సౌకర్యార్థం మరో కమ్యూనిటీ హాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. మధురానగర్ ఆర్‌యూబీ సమీపంలోని ఉద్యానవనం సమీపంలో కానీ, ఏలూరు కాలువ పక్కన ఉన్న ఖాళీస్థలంలోగానీ నిర్మించాలంటున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న సీఐటీయూ భవన నిర్మాణ విభాగం నాయకులు

పటమట(విజయవాడతూర్పు): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈ నెల 24న సీఐటీయూ ఆధ్వర్యాన నగరంలోని ధర్నా చౌక్‌లో తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ తూర్పు నగర అధ్యక్షుడు వీబీ రాజు అన్నారు. పటమటలో గురువారం కార్యక్రమ బ్రోచర్‌ను, కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల్లో సంక్షేమ బోర్డు అమలవుతోందని ఏపీలో మాత్రమే ఇది అమలు కావడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో సంక్షేమ బోర్డుని భవన నిర్మాణ కార్మికులకు తీసుకొస్తామని హామీ ఇచ్చి నెలలు పూర్తవుతున్నా పట్టించుకోని పరిస్థితి వచ్చిందన్నారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల గృహ నిర్మాణాలకు వెల్ఫేర్ బోర్డు ద్వారా సబ్సిడీ లోన్లు ఇవ్వాలని, కార్మికులు పని కోసం వేచి ఉండే అడ్డాలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉచిత వైద్యం ,పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, జిల్లాల వారీగా వలస కార్మికులకు ప్రస్తుతం ఉంటున్న చిరునామా పై సంక్షేమ గుర్తింపు కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.శ్రీను, సింహాచలం, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం, దేహ దారుఢ్యం



భానుప్రియను సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): క్రీడలతో విద్యార్థుల్లో మానసిక వికాసం, దేహదారుఢ్యం కలుగుతుందని చైతన్య కళాశాల ఎగ్జిక్యూటివ్ డీన్ గుంటూరు హరిబాబు అన్నారు. ఏలూరు రోడ్డు శ్రీ చైతన్య కళాశాలకు చెందిన మనుబోలు భానుప్రియ జాతీయ స్థాయి టాంగ్ టా మార్షల్ ఆఫ్ ఆర్ట్స్ అండర్–19 బాలికల విభాగంలో కాంస్య పతకం సాధించింది. గురువారం కళాశాలలో భానుప్రియ అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జాతీయ స్థాయి టాంగ్ టా పోటీల్లో తమ విద్యార్థిని రాష్ట్రం తరపున కాంస్య పతకం సాధించడం గర్వకారణమన్నారు. ప్రిన్సిపాల్ నిజాంపట్నం గోకర్ణేశ్వరరావు మాట్లాడుతూ తమ కళాశాల విద్యతో పాటు క్రీడలనూ ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం భానుప్రియను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ఏజీఎం కొమ్మినేని రంగారావు, వైస్ ప్రిన్సిపాల్ నీలిమ, కోచ్ అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు



దేవరాగం నాటికలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: పీఎంకేఎం ఆర్ట్స్, ఏపీ చలన చిత్ర వాణిజ్యమండలి సంయుక్త ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో ప్రదర్శిచిన 44వ జాతీయ సాంఘిక నాటికల పోటీలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. తొలి ప్రదర్శనగా కేకేఎల్ స్వామి రచించి దర్శకత్వం వహించిన దేవరాగం నాటికలను, రెండో ప్రదర్శనగా బ్రహ్మానందరావు, రచించి దర్శకత్వం వహించిన మనసాక్షి, మూడో నాటికగా, పల్లేటి కుశలశేఖర్ రచించి దర్శకత్వం వహించిన మోచేతి కంకణాలను ప్రదర్శించారు. నాటక రంగానికి చెందిన సూర్యదేవర జగన్నాథరావు, దామోదర గణపతిరావు, ఈవన రమేష్‌బాబును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకటరమణ, సోమిశెట్టి అమృత వర్షిణి, గుడివాడ లహరి, కొండిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



పాయకాపురం(విజయవాడరూరల్): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యాన గురువారం పుచ్చలపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్లో 90 మంది విద్యార్థులకు కళ్లజోళ్లను పంపిణీ చేశారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మ్యాక్స్ విజన్ ఆస్పత్రి డాక్టర్లు ఉచితంగా కంటి వైద్య పరీక్షలు చేశారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు మంచి ఆహార పదార్థాలు తీసుకోవాలని రోటరీక్లబ్ ప్రతినిధి శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ ఎం.హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు స్ఫూర్తి వివేకానందుడు



స్నాతకోత్సవంలో వివేకానందుని వేషధారణలో చిన్నారులు



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువతకు స్ఫూర్తి వివేకానందుడు అని సెవెన్ హిల్స్ పాఠశాల కరస్పాండెంట్ దుర్గాప్రసాద్‌రాజు తెలిపారు. సీతారాంపురం శ్రీ సెవెన్‌హిల్స్ పాఠశాలలో గురువారం చిన్నారుల స్నాతకోత్సవం జరిగింది. వివేకానందుని వేషధారణలో విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. దుర్గాప్రసాద్‌రాజు మాట్లాడుతూ చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకుడు రామకృష్ణ, జనరల్ మేనేజర్ దుర్గా ప్రసాద్, చల్లా లక్ష్మీనారాయణ, జె.వి.షణత్ కృష్ణ, రాఘవరాజు పాఠశాల ప్రిన్సిపాల్ డి.సునీత విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

షేక్ కలీషా కుటుంబానికి న్యాయం చేయండి

విజయవాడరూరల్: పంచాయతీరాజ్ డిపార్టుమెంట్‌లో పని చేసి మరణించిన షేక్ కలీషాకు న్యాయ పరంగా రావాల్సిన పదవీ విరమణ ప్రయోజనాలను మంజూరు చేసి ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని ఏపీ ఎన్జీఓ నేతలు జిల్లా పంచాయతీ అధికారిణి పి.లావణ్యకుమారిని గురువారం కలిసి వినతి పత్రం అందచేశారు. 1981లో ఫిట్టర్‌గా చేరిన కలీషా 2005లో పదవీ విరమణ చేసి 2024లో మరణించారని, వీరి సర్వీస్ కాలంలో సర్వీస్ రెగ్యులర్ కాలేదని తెలిపారు. కలీషా సర్వీసును సరైన విద్యార్హతలు లేవని రెగ్యులర్ చేయలేదని, సిబ్బంది సరైన సమాచారం పై అధికారులకు పంపలేదని ఎన్జీఓ ప్రతినిధులు తెలియచేశారు. ఈ విషయాన్ని ఎన్జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.విద్యాసాగర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన దస్త్రాన్ని పరిశీలించి కలీషా కుటుంబానికి న్యాయం చేయాలని డీపీఓతో ఫోనులో మాట్లాడారు. అనంతరం ఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రమణ, మహిళా కార్యదర్శి శివలీల తదితరులు డీపీఓను కలిసిన వారిలో ఉన్నారు.

రేపు రన్ ఫర్ జీసెస్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): క్రైస్తవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 19న రన్‌ఫర్ జీసెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఐక్యవేదిక ప్రతినిధులు వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈనెల 19వ తేదీ ఉదయం 6 గంటలకు బెంజిసర్కిల్ సెయింట్ కెథడ్రల్ నుంచి 5వ నంబర్ రోడ్డు మీదగా సీఎస్ఐ సెయింట్ బాసిలిక వరకు రన్ జరుగుతుందని తెలిపారు. ఈ రన్‌ను విజయవంతం చేయాలని క్రైస్తవ ఐక్యవేదిక ప్రతినిధులు కోరారు.

నాన్ ఆపరేషన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్లకార్డులు పట్టుకొని ధర్నా చేస్తున్న కార్మికులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆర్టీసీకి సంబంధించి విజయవాడలోని నాలుగు నాన్ ఆపరేషన్ యూనిట్స్‌లోని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విద్యాధరపురంలోని ఆర్టీసీ వర్క్‌షాప్ ముందు ధర్నా చేశారు. నాన్ ఆపరేషన్ యూనిట్స్ సెక్రటరీ కల్యాణ్ కుమార్, వర్క్‌షాప్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.స్వామి, సీహెచ్ శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్‌ను తక్షణమే ఎత్తి వేయాలని, ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం ఇవ్వాలని, ఈహెచ్ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 114 జీఓలో పొందుపరిచిన విధంగా నైట్ అవుట్ అలవెన్స్‌లను రూ.150 నుంచి రూ.400 చెల్లించాలని, డెప్యుటేషన్లను యథావిధిగా అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణాలను అనుమతించాలని పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా వేతనాలను చెల్లించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీఓ ప్రకారం వారి పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని, టీఆర్ఎస్‌లో వల్కనైజింగ్ పోస్టులను భర్తీ చేయాలని, నిలిచిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని, మేనోవర్ రేట్‌ను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఏపీఎస్ఆర్టీసీలో మాదిరిగానే క్యాడర్ స్ట్రెంగ్త్‌ను అమలు చేయాలన్నారు. ఎలక్ట్రిక్ బస్‌లను ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

200 మందికి అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన శ్రీ వారి అన్నప్రసాదాన్ని భక్తులకు చేరువ చేసే కార్యక్రమంలో భాగంగా గురువారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణమండపంలో 200 మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. దాత ఇంటి లక్ష్మితోపాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి పాల్గొన్నారు. మండపం ఆవరణలోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామికి అర్చకులు పూజలు చేశారు.

దేవినేనికి ఘన నివాళి



గుణదల నెహ్రూ ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కడియాల బుచ్చిబాబు తదితరులు



రింగ్ రోడ్డులో నివాళులర్పిస్తున్న అవినాష్, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ తదితరులు

గుణదల(విజయవాడ తూర్పు): విలువలు కలిగిన రాజకీయ నాయకుడిగా దేవినేని రాజశేఖర్ (నెహ్రూ) ప్రజలకు సేవచేశారని పలువురు వైఎస్సార్ సీపీ నేతలు అభిప్రాయపడ్డారు. మాజీ మంత్రి దేవినేని నెహ్రూ వర్ధంతి కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. 'తూర్పు'లోని అన్ని డివిజన్లలో దేవినేని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పేదలకు దుస్తుల పంపిణీ, అన్నదానం, వంటి సేవా కార్యక్రమాలు చేశారు. నెహ్రూకు వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అవినాష్ నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, మొండితోక అరుణ్‌కుమార్, రమేష్‌యాదవ్, సీనియర్ నేత కడియాల బుచ్చిబాబు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

- **మొగల్రాజపురం:** ఆరో డివిజన్ పరిధిలోని మారుతీనగర్, నిమ్మతోటసెంటర్‌లో అన్నదానాలు చేశారు.
- **కృష్ణలంక:** 17, 18, 20, 21,22 డివిజన్లలో నెహ్రూ చిత్రపటాలు, విగ్రహాల వద్ద నేతలు నివాళులర్పించారు.

పటమట: 9,10,11,12,13,14 డివిజన్లలో నేతలు అన్నదానాలు, చీరల పంపిణీ చేశారు.

ఆటోనగర్: ఆటోనగర్ పరిసరాలు, 15వ డివిజన్‌లో నేతలు నివాళులర్పించారు. పలుచోట్ల అన్నదానాలు జరిగాయి.

ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో నలంద కళాశాల ఆధ్యాపకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు ఉద్యోగాలు చేయడమే కాకుండా ఇతరులకు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి, ప్రొఫెసర్ రామ్‌జీ కునా ఆకాంక్షించారు. నలంద డిగ్రీ కళాశాలలో 2024–25లో అత్యధిక ప్లేస్‌మెంట్ సాధించిన సందర్భంగా గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ అధ్యక్షతన గురువారం సక్సెస్ మీట్–2025 నిర్వహించారు. ముఖ్య అతిథి రామ్‌జీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు సాధించడం కష్టంగా ఉందని, ఈ నేపథ్యంలో క్యాంపస్ డ్రైవ్‌లో కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎన్టీఆర్ జిల్లా యువజన సేవల విభాగం ముఖ్య కార్య నిర్వహణాధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులకు చక్కటి కోర్సులను అందించడంతో పాటు వారి భవిష్యత్తుకు ఉపయోగపడటానికి ఉపాధి అవకాశాలను అందిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ 2024–25లో తమ కళాశాల విద్యార్థులు వివిధ కార్పొరేట్ కంపెనీలో 374 మంది ఉద్యోగ అవకాశాలు పొందారన్నారు. అనంతరం ఉద్యోగ అవకాశాలు పొందిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ ఖాసిం షా, అధ్యాపకులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బాలిక అదృశ్యమైన ఘటనపై ఆమెఅమ్మమ్మ ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వించిపేట కొండ ప్రాంతంలో రామాలయం వద్ద కోనా లక్ష్మి నివాసం ఉంటోంది. ఆమె రెండో మనవరాలు(16) వన్‌టౌన్‌లోని మహిళా కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కొంత కాలంగా అనారోగ్యం కారణంగా కాలేజీకి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటోంది. ఇంటి వద్ద ఉన్న బాలిక తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ కనిపించేది. బుధవారం మధ్యాహ్నం బాలిక బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన లక్ష్మి ఆరా తీయగా, కొంత కాలంగా బాలిక అవినాష్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడేదని తెలిసింది. తన మనవరాలు కనిపించడం లేదని పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ఉత్తమ విలువలతో నాయకత్వ లక్షణాలు పెంపు

పటమట(విజయవాడతూర్పు): విద్యార్థులు ఉత్తమ విలువలతో కూడిన విద్యను అభ్యసించి నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని ఆస్టర్ రమేష్ హాస్పటల్స్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాధాకృష్ణ రామాయణపు అన్నారు. పటమట ఎస్.ఎస్.ఎం.పబ్లిక్ స్కూల్‌లో గురువారం పాఠశాల విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఆయన విద్యార్థి నాయకులతో ప్రమాణ స్వీకారం చేయించి, బ్యాడ్జీలను ధరింపజేసి, బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సద్గుణాలను అలవరచుకోవడానికి పాఠశాలలు ప్రధాన వేదికలని, అంకిత భావం, మానవతా దృక్పథం, సహాయ సహకారం లాంటి సద్గుణాలను మనసులో నింపుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ రాయప్పరెడ్డి, కరస్పాండెంట్ బ్రదర్ మౌంట్ ఫోర్ట్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బ్రదర్ బాలారెడ్డి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

నున్నలో తాగునీరు కలుషితం



నున్నలో కలుషితమైన చెరువు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో తాగునీరు కలుషితమవుతోంది. ఇటీవల వైద్యసిబ్బంది సేకరించిన తాగునీటి శాంపిల్స్‌లో కలుషితమవుతున్నట్లు శాఖా పరమైన రిపోర్టులో వెల్లడైనట్లు ఎంఎల్‌హెచ్‌పీ సీహెచ్ రమ్య తెలియజేశారు. వైద్యశాఖ నివేదిక ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపర్చారు. దాన్ని చూసిన కలెక్టర్ లక్ష్మీశ నున్న గ్రామాన్ని సందర్శించి కలుషిత నీటి సరఫరా తీరును పరిశీలించడానికి గురువారం రావాల్సి ఉంది. అనివార్య కారణాలతో ఆయన పర్యటన రద్దు అయ్యింది. పోలవరం కాల్వ నుంచి వస్తున్న నీటిని చెరువులోకి నింపి మైక్రోఫిల్టర్ ద్వారా శుద్ధి చేసి గ్రామంలోని మినీ ట్యాంకుల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో తాగునీరు ఫిల్టరైజేషన్ కాకపోవడంతో నీరు రంగుమారినట్లు వైద్యశాఖ సిబ్బంది గుర్తించారు. ఇదే పరిస్థితి కొనసాగితే డయేరియా ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

వన సంరక్షణ సమితి కమిటీ ఎన్నిక



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ పరిధిలోని బోడపాడులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వన సంరక్షణ సమితి నూతన కమిటీ ఎన్నిక ఫారెస్ట్ డీఆర్వో పోతురాజు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో నర్సరీల పెంపకం, మొక్కలు, వనాలు, వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత వన సంరక్షణ కమిటీపై ఉంటుందన్నారు. అడవిలో ఉండే జంతువులు, ఇతర వణ్య ప్రాణుల వేట, అక్రమ రవాణా నివారించే చర్యలు చేపట్టాలన్నారు. అగ్ని ప్రమాదాల బారిన జంతువులు పడకుండా పర్యవేక్షించాలని సూచించారు. నూతన కమిటీలో 15 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఫారెస్ట్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.